క్లుప్తంగా

పాఠశాలలో వసతుల పరిశీలన



గంభీరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో జానకి

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఎంపీపీ పాఠశాలలో శనివారం మండల పరిషత్ అధికార బృందం వసతులను పరిశీలించింది. ఎంపీడీవో జానకి ముందుగా విద్యార్థులతో మాట్లాడి వారి ప్రగతిని అంచనా వేశారు. పాఠశాల ఆవరణలో ఉన్న వాటర్ ట్యాంకును, మధ్యాహ్న భోజన పథకం, టాయిలెట్లను పరిశీలించారు. పాఠశాల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు వి.వి.ప్రసాద్‌తో మాట్లాడి మిగిలిన వివరాలు తెలుసుకున్నారు. ఆమె వెంట పంచాయతీ విస్తరణ అధికారి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి చలపతి, ఎడ్యుకేషన్ కమ్ వెల్ఫేర్ అసిస్టెంట్ దిలీప్ ఉన్నారు.

జోన్–2 ఏపీడీగా శ్రీరాం



జెడ్పీ సింహాచలానికి జాయినింగ్ రిపోర్టు అందజేస్తున్న శ్రీరాం

మధురవాడ: జీవీఎంసీ జోన్–2 మధురవాడ ఏపీడీగా వైవై శ్రీరాం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన గంగాధర్ గాజువాక జోన్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో పెందుర్తి జోన్–8నుంచి శ్రీరాం బదిలీపై వచ్చారు. ఈ మేరకు జెడ్పీ సింహాచలంకు జాయినింగ్ ఆర్డర్ అందజేశారు.

రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్‌లో లక్ష్మీనారాయణ ప్రతిభ



రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ షీల్డ్ అందుకుంటున్న లక్ష్మీ నారాయణ

మధురవాడ: రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలలో మధురవాడ రేవళ్లపాలెంకు చెందిన పిళ్లా లక్ష్మీనారాయణ ప్రతిభ చాటుకున్నాడు. ఈ నెల 17, 18,19 తేదీలలో గుంటూరు బీఆర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో విశేష ప్రతిభ కనబరచి తృతీయ స్థానంలో నిలిచాడు. సందర్భంగా లక్ష్మీనారాయణను పలువురు అభినందించారు.

కారు ఢీకొనడంతో మహిళకు గాయాలు

పీఎంపాలెం: జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో మహిళకు గాయాలయ్యాయి. వివరాలిలా.. గాజువాక ప్రాంతానికి చెందిన కందుల రమేష్ భార్య శ్రీదేవి, తమ్ముడు ద్విచక్రవాహనంపై శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో విజయనగరం నుంచి మధురవాడ వైపు వస్తున్నారు. బోరవానిపాలెం డంపింగ్ యార్డుకు వచ్చేసరికి అదే రోడ్డులో వెనుక వస్తున్న కారు ఢీకొనడంతో శ్రీదేవి కింద పడిపోవడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం గాయత్రీ ఆస్పత్రికి తరలించారు. శ్రీదేవి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పీఎంపాలెం సీఐ బాలకృష్ణ తెలిపారు.

అనంతుని ఘాట్ రోడ్డుకు మహర్దశ

- రూ.5కోట్లతో అభివృద్ధి
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో నిధుల మంజూరు
- భక్తుల్లో హర్షాతిరేకాలు



రోడ్డు కోతకు గురికాకుండా ఏర్పాటు చేసిన స్టోన్ పిక్చింగ్



గిరిపై నుంచి నీరు కిందకు వెళ్ల పోవడానికి రోడ్డుకు అనుసంధానంగా నిర్మించిన కల్వర్టు

పద్మనాభం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో అనంతుని ఘాట్ రోడ్డుకు మహర్దశ పట్టింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేయడంతో ఘాట్ రోడ్డు బీటీగా రూపాంతరం చెందుతోంది. దీంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం ఘాట్ రోడ్డును అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం వహించింది. దీంతో భక్తులు మెట్ల మార్గం ద్వారా అనంత పద్మనాభ స్వామి దర్శించుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. త్రిభుజాకారంతో అత్యంత ఎత్తులో ఉన్న గిరిపైకి 1285 మెట్లు ఎక్కి స్వామి సన్నిధికి చేరుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అనంత పద్మనాభ స్వామి ఆలయాలు దేశంలో రెండు చోట్ల మాత్రమే ఉన్నాయి. ఒకటి కేరళ రాష్ట్రం తిరువునంతపురం, ఇంకోకటి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ జిల్లా పద్మనాభం మండలం పద్మనాభం గ్రామంలో గిరిపై కొలువై ఉంది. దేశంలో రెండో క్షేత్రంగా, రాష్ట్రంలో ఏకైక క్షేత్రంగా భాసిల్లడంతో పద్మనాభంలోని అనంత పద్మనాభ స్వామిని దర్శించుకోవడానికి భక్తులు ఎక్కువగా వస్తుంటారు. గిరిపై కొలువు దీరిన స్వామి దర్శించుకోవడానికి మెట్లు ఎక్కి వెళ్లలేక అధిక శాతం మంది భక్తులు గిరి ప్రథమ పావంచా వద్ద, గిరి దిగువున అనంత పద్మనాభ స్వామి క్షేత్రానికి అనుబంధంగా ఉన్న కుంతీ మాధవ స్వామి, కుంతీ మాదవ స్వామి ఆలయంలో ఉన్న అనంతుని ఉత్సవ విగ్రహాల వద్ద పూజలు చేసుకుని వెనుదిరుగుతన్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు అనంత పద్మనాభ స్వామి ఘాట్ రోడ్డును బీటీగా అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేయాలని నాటి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ద్వారా వైవీ సుబ్బారెడ్డి దృష్టికి తీసుకు వెళ్లారు. దీనికి స్పందించిన వైవీ సుబ్బారెడ్డి అప్పటి సీఎం వై.ఎస్.జగన్ మోహన రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి పంచాయతీ రాజ్ నిధులు రూ.5 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో ఘాట్ రోడ్డు అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. అర్చకునిపాలెం సమీపం నుంచి గిరిపైకి 3.3 కిలోమీటర్ల నిడివి గల రోడ్డును బీటీగా అభివృద్ధి చేయనున్నారు. 7.5. మీటర్లు వెడల్పు బీటీగా అభివృద్ధి చేయనున్నారు. ఇప్పటికి 20, 40 ఎంఎం మెటల్ వేసి ఘాట్ రోడ్డు మరింత పటిష్టవంతం చేశారు. గిరి కింద నుంచి పై వరకు ఉన్న తొమ్మిది మలుపువల వద్ద రోడ్డు స్టోన్ పిక్చింగ్ చేశారు. గిరిపై నుంచి నీరు గిరి కిందకు వెళ్లిపోయేందుకు రోడ్డుకు అనుసంధానంగా మూడు చోట్ల కల్వర్టులు నిర్మాంచారు. గిరి మీద నుంచి నీరు రోడ్డు మీదకు రాకుండా 1600 మీటర్ల పొడవులో కెర్బో వాల్ నిర్మించారు. భక్తులు, పర్యాటకులు గిరిపై నుంచి అందాలు తిలకించేందుకు రెండు వ్యూ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నారు. గిరిపైకి వెళ్లే వాహనాలను పార్కింగ్ చేసేందుకు 80 మీటర్ల పొడవులో ప్రాంతాన్ని సిద్ధం చేశారు. రోడ్డు అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. వచ్చే నెల 30న జరగనున్న అనంత పద్మనాభ స్వామి కొండ దీపోత్సవానికి బీటీ రోడ్డును వినియోగంలోకి తీసుకు వచ్చేవిధంగా పనులు వేగవంతం చేస్తున్నారు. ఘాట్ రోడ్డు బీటీగా రూపాంతరం చెందడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గిరిపై నుంచి నీరు రోడ్డు మీదకు రాకుండా నిర్మించిన కెర్బో వాల్



వాహనాల పార్కింగ్‌కు సిద్ధం చేసిన ప్రాంతం

రూ.60 లక్షలతో శిఖరం పునర్నిర్మాణం

గిరిపై ఉన్న అనంత పద్మనాభ స్వామి ఆలయ శిఖం పిడుగుపాటుకు దెబ్బతింది. దీన్ని పునర్నిర్మించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సీజీఎఫ్ నిధులు రూ.60లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో శిఖరం పునర్నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఇందు కోసం ఒడిశా నుంచి రాతి పలక తీసుకు వచ్చారు. పనులు జరుగుతున్నందున గిరిపైన గర్భాలయంలో ఉన్న స్వామి మూల విరాట్‌ను పైకి కనిపించకుండా మూసేశారు.



గిరిపైన పునర్నిర్మిస్తున్న అనంత పద్మనాభ స్వామి ఆలయ శిఖరం

రోడ్డు నిర్మిస్తుండడం ఆనందంగా ఉంది



అనంత పద్మనాభ స్వామి గిరిపైకి ఘాట్ రోడ్డును బీటీ అభివృద్ధి చేయడం ఆనందించదగ్గ విషయం. స్వామిని దర్శించుకోవడానికి మెట్లపై నుంచి వెళ్లడానికి ఇబ్బంది పడేశాళం. బీటీ రోడ్డుగా అభివృద్ధి చెందడంతో కొండపైకి వాహనాలు వెళ్లడానికి మార్గం సుగమం అవుతుంది.

–పి.శ్రీను, పెందుర్తి

బీటీ రోడ్డుతో గిరిపైకి మార్గం సుగమం



బీటీ రోడ్డు నిర్మాణం వల్ల భక్తులు గిరిపైకి వాహనాల మీద సులువుగా వెళ్లి అనంత పద్మనాభ స్వామిని దర్శించుకోవచ్చు. మెట్ల మార్గం ద్వారా గిరిపైకి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. బీటీ రోడ్డు అందుబాటులోకి వస్తే భక్తులు గిరిపైకి వెళ్లడానికి పడే ఇబ్బందులు తప్పుతాయి. మరింత ఎక్కువ మంది భక్తులు గిరిపైకి వెళతారు. పెందుర్తి నుంచి వచ్చి స్వామిని దర్శించుకున్నాను.

– పి.మహేష్, పెందుర్తి

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



కొత్తగా నిర్మిస్తున్న మార్కెట్ నమూనాను పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

భీమునిపట్నం: భీమిలి జోన్ పరిధిలోని సమస్యలను పరిష్కారంపై ప్రత్యేక దృష్టిని సారిస్తానని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. శనివారం మూడో వార్డుల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బీచ్ పార్కు సమీపంలో రోడ్డుపక్కన అలల తాకిడికి కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. వెంటనే ఇక్కడ రక్షణ గోడ నిర్మించాల్సిన అవసరం ఉందని, అంచనాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే వుడా మైదానం వద్ద సమస్యలు, ఇండోర్ స్టేడియంలో అవసరమైన సదుపాయాల కల్పనకు త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. మెయిన్‌రోడ్డులోని గంటస్తంభం ప్రాంతాన్ని ఆధునికీకరించాలని, ఇక్కడ కొత్తగా నిర్మిస్తున్న మార్కెట్ షాపులపై కల్యాణ మండపం నిర్మాణానికి అంచనాలను రూపొందించాలని కోరారు. అలాగే అవసరమైన ప్రాంతాల్లో కాలువలు నిర్మించాలన్నారు. ప్రధాన ఇంజినీర్ శివప్రసాదరాజు, ఏసీపీ తిరుపతిరావు, జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్న వాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో కార్తీక దామోదర మాసోత్సవాలు ప్రారంభం



దీపాల అలంకరణలో రాధాకృష్ణులు, జగన్నాథ స్వాములు

కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో శనివారం కార్తీక దామోదర మాస ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు వచ్చే నెల 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఇస్కాన్ అధ్యక్షులు సాంబాదాస్ ప్రభూజీ పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా రోజూ వేకువ జామున 4.30 గంటల నుంచి ఆరు వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళహారతి, నర్సింహ హారతి, తులసి హారతి, భగవంతునికి నేతి దీప సమర్పణ, గజేంద్ర స్తుతి, దామోదరాష్టకం, గోపి గీత, భగవద్గీత, శిక్షాష్టకం, యుగలాష్టకం పారాయణం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తగరపువలస: చిట్టివలస(తగరపువలస) ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీషు, కంప్యూటర్ సైన్స్, హిస్టరీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టులు ఇంగ్లీషు మీడియంలో తాత్కాలిక ప్రాతిపదికపై బోధించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నారు. సంబంధిత సబ్జెక్టులలో అభ్యర్థులు 55 శాతం కంటే అధికమార్కులు కలిగి ఉండాలన్నారు. ఏపీసెట్, యూజీసీ నెట్, పీహెచ్‌డీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోధనానుభవం, కంప్యూటర్ వినియోగంలో పరిజ్ఞానం, ప్రచురణలు కలవారికి అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఎంపికైన వారికి గంటకు రూ.400 వంతున గౌరవ వేతనం చెల్లించనున్నారు. ఆసక్తి కలిగిన వారు ధ్రువ పత్రాలతో పాటు పాఠ్య బోధనకు సిద్ధంగా రావాలన్నారు. ఇంగ్లీషు, హిస్టరీ అభ్యర్థులకు ఈ నెల 23న, కంప్యూటర్ సైన్స్, బోటనీ, జువాలజీ అభ్యర్థులు 25న ఉదయం 10 గంటల నుంచి కళాశాల ఆవరణలో మౌఖిక, పాఠ్యబోధన సామర్థ్య పరీక్షలకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులు కోరారు.

క్షేత్ర పర్యటలో చిన్నారులు



కోరాడలో వరి పైరు వద్ద విద్యార్థులు

పద్మనాభం: పాఠశాలలోనే పాఠాలు వల్లించడం కాకుండా క్షేత్ర పర్యటనకు విద్యార్థులను తీసుకు వెళితే మరింత జ్ఞానం పెరుగుతుంది. క్షేత్ర పర్యటన వల్ల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడతాయి. దీనిలో భాగంగా కోరాడ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులు 30 మందిని శనివారం ఉపాధ్యాయులు క్షేత్ర పర్యటనకు తీసుకువెళ్లి స్థానికంగా పండించే పంటలపై అవగాహన కల్పించారు. వరి, బంతి తోటల వద్దకు తీసుకు వెళ్లి వీటి గురించి తెలియజేశారు.

సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు



అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

పీఎంపాలెం: సీజనల్ వ్యాధులు నివారించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పి.జగదీశ్వరరావు అన్నారు. శుక్రవారం పీఎం పాలెంలోని ప్రభుత్వ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల వ్యాప్తి– నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ మేరకు జిల్లాలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఆసుపత్రిలో రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట స్థానిక వైద్యాధికారి సుజాన్ పల్లా, వైద్య సిబ్బంది ఉన్నారు. అనంతరం జీవీఎంసీ ఆరోవార్డులోని బీ–2 కాలనీలోని పిల్లలకు వేస్తున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమావతి, డీఈఎంవో నాగేశ్వరరావు, డీపీఎంఈవో నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపులు



కొండపేట రహదారిలో కొత్త వైన్‌షాపు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు కొండపేట రహదారిలో వైన్‌షాపు కారణంగా ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ఉన్న షాపుతో పోలిస్తే కొత్త షాపు మరింత ముందుకు జరగడంతో ఈ షాపును ఆనుకుని నివాసం ఉంటున్న వారు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. మద్యం సేవించడానికి వచ్చేవారు చేసే గలీజుతో ఈ ప్రాంతంలో శాంతిభద్రతలకు క్షీణిస్తాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంబేడ్కరు కూడలి నుంచి కొండపేట మార్గం ద్వారా వెళ్లే మహిళలు, ఉద్యోగినులు, విద్యార్థినులు ఈ షాపు ఆవరణలో మందుబాబులు చేసే రచ్చతో భయాందోళనలకు గురవుతున్నారు. దీంతో చాలా వరకు మహిళలు చుట్టూ తిరిగి రాములమ్మ థియేటర్ మార్గంలో కొండపేట చేరుకుంటున్నారు. కొండపేట రహదారిలో మద్యం దుకాణం వలన దీని ఆవరణలో విక్రయించే అనుబంధ ఆహార పదార్థాల విక్రయాల వలన తరచూ వ్యాపారులతో మందుబాబులు తగాదాలకు దిగి గొడవలకు దిగుతున్నారు. దుకాణం ఆవరణలోనే మద్యం తాగుతున్నారు. అలాగే దేవాదాయశాఖ ఆధ్వర్యంలో సంగివలస పోలమాంబ ఆలయం ఎదురుగా వంద మీటర్ల కంటే తక్కువ దూరంలోనే రెండు షాపులకు అనుమతి ఇవ్వడం స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. నిత్యం ముగ్గురు అమ్మవార్ల ఆలయానికి వచ్చే వందలాది మంది భక్తులతో పాటు అనిట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు, అనిల్ నీరుకొండ ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు. సంగివలస నివాసాలకు చేరువగా మద్యం దుకాణానికి అనుమతి ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. భీమిలి చినబజారు వద్ద షిర్డీ సాయి బాబా ఆలయానికి వంద మీటర్లు లోపే కంటెయినర్‌లో మద్యం దుకాణం తెరవడంతో అక్కడివారు మండిపడుతున్నారు.



కొమ్మాది-కార్ షెడ్ రోడ్డులో నిలిచిపోయిన ట్రాఫిక్

మధురవాడలో నిత్యం ట్రాఫిక్ టెన్షన్

మధురవాడ: సాయంత్రం అయితే చాలు మధురవాడలో ప్రతి రోజూ ట్రాఫిక్ ఇబ్బందులు తెలెత్తుతున్నాయి. ప్రధానంగా జంక్షన్‌ల వద్ద ఇరు వైపులా వాహనాల పార్కింగ్‌తో హైవేలో వచ్చిన వాహనాలు కిందికి వెళ్లలేని పరిస్థితి. జంక్షన్ వద్ద వాహనాలు నిలిచి పోవడం మరిన్ని ఇబ్బందులు తెచ్చి పెడుతోంది తాజాగా కార్ షెడ్ వద్ద వచ్చిన వైన్ షాపుతో ట్రాఫిక్ జఠిలంగా మారింది. గంటల తరబడి వాహన చోదకులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నారు. శనివారం సాయంత్రం ఆరు గంటల తర్వాత కొమ్మాది–కార్‌షెడ్ జంక్షన్ మధ్య భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో వాహనాలు చాలా సేపు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. దీంతో పలువురు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

తాగునీరు వృథా



బంటుపల్లి కళ్లాల వద్ద వృథాగా పోతున్న తాగునీరు

తగరపువలస: ఆనందపురం మండలం బంటుపల్లి కళ్లాల వద్ద వీధి కుళాయి పైపును ఇటీవల ఆకతాయిలు ధ్వంసం చేశారు. దీంతో కొంతకాలంగా తాగునీరు వృథాగా పోతోంది. విరిగిన పైపును గ్రామీణ నీటిసరఫరా విభాగ సిబ్బంది, పంచాయతీ పాలకవర్గం గాని పట్టించుకోకపోవడంతో నీరు వృథాగా పోతోంది. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

పీఎంశ్రీ పోటీలలో విద్యార్థులకు బహుమతులు

తగరపువలస: భీమిలి డైట్‌లో శుక్రవారం నిర్వహించిన పీఎంశ్రీ జిల్లా స్థాయి విద్యాంజలి పోటీలలో ఆనందపురం జడ్పీహైస్కూల్ విద్యార్థులకు క్విజ్‌లో మొదటి బహుమతి, డిజిటల్ క్వెస్ట్‌లో రెండో బహుమతి సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. క్విజ్ పోటీలలో 8,9వ తరగతి విద్యార్థులు వెంకట సాయి, కార్తీక్ ఈ ఘనత సాధించగా డిజిటల్ క్వెస్ట్‌లో 9,10వ తరగతి విద్యార్థులు డి.లీలావర్ధన్, ఉపేంద్ర విజయం సాధించారు. వీరికి గైడ్‌గా ఎస్వీ మహేష్ వ్యవహరించారు. ప్రధానోపాధ్యాయుడు కె.రామకృష్ణ పట్నాయక్ వీరిని అభినందించారు.

విద్యార్థి మృతిపై తల్లిదండ్రుల ఆందోళన

మధురవాడ: స్థానిక శ్రీ విశ్వ కళాశాల హాస్టల్‌లో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న భానుప్రకాష్ (16) రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో కళాశాల యాజమాన్యం శనివారం స్థానిక ఆస్పత్రిలో చేర్పించింది. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం ఐదు గంటల సమయంలో మృతి చెందాడు. సమాచారమందుకున్న తల్లిదండ్రులు కళాశాలకు చేరుకుని యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా తమ కుమారుడు మృతి చెందాడని ఆందోళన చేశారు. విద్యార్థిది విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం అలజంగి గ్రామం.

ధరల పెరుగుదలపై నిరసన



మార్కెట్ వద్ద ప్రచారం చేస్తున్న సీపీఐ నాయకులు

మధురవాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోపుతున్న భారాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువులు, ఇసుక లేక భవన నిర్మాణ కార్మికులు పడుతున్న ఇబ్బందులపై కొద్ది రోజులుగా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మధురవాడ డైలీ మార్కెట్ పరిసరాల్లో ప్రచారం చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఏఐటీయూసీ నాయకులు బంగారయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలపై మాట తప్పిన చంద్రబాబు



మధురవాడ జోన్–3 ఈఈ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం శ్రేణులు

మధురవాడ: ఎన్నికల్లో విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు మాట నిలబెట్టుకోవాలని సీపీఎం మధురవాడ జోనల్ కార్యదర్శి డి.అప్పలరాజు డిమాండ్ చేశారు. శనివారం మధురవాడలోని విద్యుత్ శాఖ విశాఖ జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం వద్ద ట్రూ అప్ చార్జీలు రూపంలో ప్రజలపై భారాలు వేయడానికి సిద్ధం చేసిన ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అనేక రూపాల్లో పెరిగిన విద్యుత్ చార్జీలు వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి గెలిస్తే కరెంటు చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి ఇప్పుడ మాట తప్పడం తగదన్నారు. బ్యానర్, ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్టీ నాయకులు రాజ్‌కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

105 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

తగరపువలస: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, వెంపాడ వెల్ఫేర్ సొసైటీ, హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో శనివారం సంగివలస సుఖీభవ కాలనీ మెడికేర్ ఆస్పత్రిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 105 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 39 మందిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. ఈ శిబిరాన్ని డాక్టర్ రామభద్రరాజు, వెంపాడ శ్రీనివాసరెడ్డి ప్రారంభించగా శంకర్ ఫౌండేషన్ వైద్యురాలు శ్రీనిజ, ఆఫ్తాలమిక్ అధికారి గంగాధర్, క్యాంపు కోఆర్డినేటర్ వై.రాజు, నర్సింగ్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రేవిడిలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం శంకుస్థాపన చేశారు. బి.ఆర్.తాళ్లవలసలో రూ.30లక్షలు, ఐనాడలో రూ.15లక్షలు, వెంకటాపురంలో రూ.15లక్షలు, గెద్దపేటలో రూ.15లక్షలతోను సిమెంటు రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. గెద్దపేటలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు పాల్గొన్నారు.